1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health

Best for Readers

THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 171 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 11 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 171 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 11 May 2025 PAGES : 8 PRICE : 3/-

## పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది: భారత్



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 10)

పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోందని ఆర్మీ ప్రతినిధి సోఫియా ఖురేషీ పేర్కొన్నారు. భారత్-పాక్ సరిహద్దుల్లో ఘర్షణలపై విదేశాంగశాఖ, మిలిటరీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ , సైన్యానికి చెందిన కర్నల్ సోఫియా ఖురేషీ వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పాల్గొన్నారు.తొలుత కర్నల్ సోఫియా ఖురేషీ మాట్లాడుతూ "పశ్చిమ సరిహద్దుల్లో పాక్ నిరంతరం దాడులు చేస్తోంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, లాయిటరింగ్ మ్యూనిషన్, ఫైటర్ జెట్లను వాడి.. భారత మిలిటరీ స్థావరాలపై దాడులు చేస్తోంది. అయితే వాటిని భారత్ తిప్పికొట్టింది. కానీ, 26 చోట్ల పాక్ ఆయుధాలు గగనతలంలోకి చొచ్చుకొచ్చాయి. అవి ఉధంపుర్, భుజ్, పఠాన్‌కోట్, భఠిండా వాయుసేన స్థావరాల్లోని పరికరాలను దెబ్బతీసి, సిబ్బందిని గాయ పర్చాయి. తెల్లవారుజామున 1.40 సమయంలో పాక్ హైస్పీడ్ మిసైల్స్‌తో పంజాబ్‌లోని వాయుసేన స్థావరాలపై దాడులు చేసింది. శ్రీనగర్, అవంతిపుర, ఉధంపుర్‌లో వైద్య కేంద్రాలపై దాడి చేసింది. ఇది రెచ్చగొట్టే చర్య అని కచ్చితంగా తెలుస్తోంది""దీనికి తగినట్లు ప్రతిస్పందిస్తూ.. భారత దళాలు పాక్‌లోని మిలిటరీ స్థావరాలు, రాడార్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లపై దాడులు చేసింది. వీటిల్లో రఫీకీ, మురిద్, చక్లాల, రహీమ్ యార్ ఖాన్, సుక్కుర్, చునియాన్ స్థావరాలు ఉన్నాయి. ఫైటర్ జెట్లతో అత్యంత కచ్చితంగా లక్ష్యాలు ఛేదించే ఆయుధాలు వాడి ఈ దాడులు నిర్వహించాము. పస్రూర్‌లో రాడార్ కేంద్రం, సియాల్‌కోట్‌లోని ఏవియేషన్ బేస్‌ను ధ్వంసం చేశాము. ఈ దాడుల సందర్భంగా పౌరులు ప్రాణాలు పోకుండా చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం""పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది. ఇది పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదకర చర్య" అని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని వ్యోమికా సింగ్ అంతర్జాతీయ మీడియా కోసం ఆంగ్లభాషలో వెల్లడించారు. భారత స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని టైమ్ స్టాంప్‌లు ఉన్న వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. 'శిర్సా, సూరత్‌ఘర్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని పాక్ చెప్పడం పూర్తిగా తప్పు. దీంతోపాటు ఆదంపుర్‌లోని ఎస్-400 , బ్రహ్మోస్ మిసైల్ డిపో, పలుచోట్ల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేసినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తోంద"న్నారు. ప్రజలు ఇలాంటి వాటిని నమ్మొద్దని చెప్పారు.

# నీ అబద్ధం తాత్కాలికం... మా నిజం శాశ్వతం

జగన్ పై నారా లోకేశ్ ఫైర్

జగన్ పాలనలో ప్రజలు గాలికొదిలేశారన్న లోకేశ్

నా సొంత నిధులతో మంగళగిరికి సాయం చేశానని వెల్లడి

సొంత డబ్బు కాబట్టే పసుపు రంగు మిషన్లు ఇచ్చానని వివరణ

ప్రజాధనంతో పథకాలకు పార్టీ రంగులు వేయలేదని స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 10)

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలను గాలికి వదిలేసి, ప్రజాధనాన్ని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా కూడా లేని సమయంలోనే, మంగళగిరి నియోజకవర్గ ప్రజల పట్ల తన బాధ్యతను గుర్తించి, వారి స్వయం ఉపాధికి చేయూతనందించేందుకు వ్యక్తిగత నిధులను వెచ్చించానని లోకేశ్ తెలిపారు. కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ అండగా నిలిచానని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తమపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ లోకేశ్ ఈ సందర్భంగా మండిపడ్డారు."జగన్ గారూ మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రజలని గాలికి వదిలేసి, జనం సొమ్ము దోచుకోవడమే -మిగతా 2లో



## నేడు శ్రీసత్యసాయి జిల్లాలో మంత్రి లోకేశ్ పర్యటన

వీర జవాన్ మురళీ నాయక్ పార్థివదేహానికి నివాళులు అర్పించనున్న మంత్రి

ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి..

అంత్యక్రియల్లో పాల్గొననున్న లోకేశ్

రాష్ట్రప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు జరిపిస్తామన్న మంత్రి

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 10)

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారు. యుద్ధభూమిలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ పార్థివదేహానికి మంత్రి నివాళులు అర్పిస్తారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొంటారు. రాష్ట్రప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు జరిపిస్తామని నిన్న మంత్రి లోకేశ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక, వీర జవాన్ మృతిపై మంత్రి లోకేశ్ శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూకశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మురళీ నాయక్ వీరమరణం పొందడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. జవాన్ చూపిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్రప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తామని తెలిపారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు. మురళీ నాయక్ స్వస్థలం ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని కల్లి తండా. గురువారం రాత్రి -మిగతా 2లో

## కుదిరితే సాఫ్ట్ కిల్... లేకపోతే హార్డ్ కిల్...!

పాక్ డ్రోన్లకు చుక్కలు చూపిస్తున్న 'డీ4'

పాకిస్థాన్ డ్రోన్ల చొరబాట్లను సమర్థవంతంగా తిప్పికొడుతున్న భారత్

టర్కిష్ డ్రోన్లనూ నిర్వీర్యం చేస్తున్న అదృశ్య కవచం

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 10)

పశ్చిమ సరిహద్దుల వెంబడి పాకిస్థాన్ తరచూ ప్రయోగిస్తున్న డ్రోన్ల చొరబాట్లకు భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన 'డ్రోన్-డిటెక్ట్, డెటర్ అండ్ డిస్ట్రాయ్' వ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకట్ట వేస్తోంది. ఇజ్రాయెల్ తన సరిహద్దుల్లో హమాస్, హౌతీల రాకెట్ దాడులను నిరోధించడానికి వినియోగిస్తున్న ప్రఖ్యాత 'ఐరన్ డోమ్' వ్యవస్థకు ఇది దీటుగా నిలుస్తోంది. ఈ అదృశ్య కవచం, పాకిస్థాన్ వినియోగిస్తున్న టర్కిష్ డ్రోన్లతో సహా అనేక వైమానిక చొరబాట్లను విజయవంతంగా నిర్వీర్యం చేస్తోంది.

**డీఆర్‌డీఓ బహుముఖ ప్రజ్ఞ :** యాంటీ-డ్రోన్ వ్యవస్థను వేగంగా అభివృద్ధి చేసే క్రమంలో, డీఆర్‌డీఓ వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన కనీసం నాలుగు ప్రయోగశాలలను ఏకతాటిపైకి తెచ్చింది. మానవ రహిత వైమానిక వాహనాలను గుర్తించడం, వర్గీకరించడం మరియు నిర్వీర్యం చేయడం కోసం బహుళ-సెన్సార్ల పరిష్కారాన్ని రూపొందించడమే లక్ష్యంగా ఈ ప్రయత్నం సాగింది. ఫలితంగా, డ్రోన్ ముప్పులను -మిగతా 2లో



## పాకిస్థాన్‌కు షాక్.. భారత్ కీలక నిర్ణయం

భవిష్యత్తులో పాకిస్థాన్ ఎలాంటి

ఉగ్రదాడికి పాల్పడినా దాన్ని యుద్ధ చర్యగానే పరిగణన?

పహల్గామ్‌లో ఉగ్రదాడితో 26 మంది పర్యాటకుల మృతి

పాకిస్థాన్, పీవోకేలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన భారత్

పాక్ దుందుడుకు చర్యతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 10)

భారతదేశ భద్రతా విధానంలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకుంది. భవిష్యత్తులో దేశ భూభాగంపై జరిగే ఎలాంటి ఉగ్రవాద చర్యలనైనా ఇకపై "యుద్ధ చర్య"గానే పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి, దానికి ప్రతిగా కొనసాగుతున్న "ఆపరేషన్ సింధూర్" నేపథ్యంలో, ముఖ్యంగా పాకిస్థాన్‌కు ఇది ఒక స్పష్టమైన హెచ్చరిక అని ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు ఐఏఎన్ఎస్‌కు తెలిపాయి.భవిష్యత్ ఉగ్రదాడులను యుద్ధ చర్యలుగా పరిగణించాలన్న ఈ నిర్ణయంతో, దశాబ్దాలుగా భారత్ అనుసరిస్తున్న "వ్యూహాత్మక సంయమనం" అనే విధానానికి స్వస్తి పలికినట్లయింది. "ఇది కేవలం భద్రతాపరమైన మార్పు మాత్రమే కాదు, ఉగ్రదాడులను ఇకపై భారత్ విడివిడి ఘటనలుగా పరిగణించబోదని ప్రపంచానికి ఇస్తున్న సంకేతం" అని ప్రభుత్వ వర్గాలు ఐఏఎన్ఎస్‌కు వివరించాయి. దీని ద్వారా, ఉగ్రవాదానికి ప్రతిగా కేవలం చట్టపరమైన చర్యలే కాకుండా, అవసరమైతే సైనిక శక్తితో బదులిస్తామని భారత్ తేల్చిచెప్పింది. ఈ సిద్ధాంతపరమైన మార్పుతో, సరిహద్దు ఉగ్రవాదానికి పాల్పడితే రాజకీయంగా, దౌత్యపరంగా, సైనికపరంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత్ స్పష్టం చేసింది.గత మూడు రోజులుగా -మిగతా 2లో

# భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ...

అధికారంగా ప్రకటించిన భారత్

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం

భూమి, గగనతలం, సముద్ర మార్గాల్లో కాల్పులు, సైనిక చర్యల నిలిపివేత

ఇరు దేశాల డీజీఎంఓల మధ్య కుదిరిన అంగీకారం

మే 12న మరోసారి చర్చలు జరిపే అవకాశం



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 10)

భారతదేశం మరియు పాకిస్థాన్ మధ్య కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరినట్లు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఒప్పందం తక్షణమే అమల్లోకి రానుండటం సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత వాతావరణానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి భూమి, గగనతలం మరియు సముద్ర మార్గాల్లో అన్ని రకాల కాల్పులు, సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని ఇరు దేశాలు అంగీకరించినట్లు విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. ఈ మేరకు పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) ఈ మధ్యాహ్నం భారత డీజీఎంఓతో ఫోన్‌లో సంభాషించారని, ఈ సంభాషణలోనే ఇరుపక్షాలు ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.అంతకుముందు, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన బృందం సుదీర్ఘ చర్చల అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య "సంపూర్ణ మరియు తక్షణ కాల్పుల విరమణ"కు మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే న్యూఢిల్లీ నుంచి అధికారిక ప్రకటన వెలువడటం గమనార్హం. పంజాబ్ నుంచి సామిరా హుస్సేన్ అందించిన సమాచారం ప్రకారం, ఈ కాల్పుల విరమణ ఒప్పందం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలుస్తోంది.ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారులు మే 12వ తేదీన మరోసారి చర్చలు జరపనున్నారని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పేర్కొన్నారు. ఈ చర్చల్లో సరిహద్దుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ కాల్పుల విరమణ నిర్ణయం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంలో కీలక ముందడుగుగా అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## బహుళ అంచెల కవచం.. భారత గగనతలం

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 10)

భారత్ ఎంతో వ్యయప్రయాసలకోర్చి సిద్ధం చేసుకున్న సమీకృత గగనతల రక్షణ గ్రిడ్.. అగ్నిపరీక్షను తట్టుకొని నిలబడింది. దేశానికి ఎదురయ్యే ముప్పులను సమర్థంగా కాచుకోవడంలో సత్తాను రుజువు చేసుకుంది. గురు, శుక్రవారం పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణులను మన గగనతల వ్యవస్థ మార్గమధ్యంలోనే కూల్చేసింది. తోడేళ్ల మందలా విరుచుకుపడ్డ డ్రోన్లలో చాలావాటిని పేల్చేసింది. ఇలా పెద్దసంఖ్యలో అస్త్రాలను ప్రయోగించడం ద్వారా మన గగనతల రక్షణ వ్యవస్థను గందరగోళంలో పడేయాలన్న పాక్ కుట్ర బెడిసికొట్టింది.




**ఏమిటీ గ్రిడ్?**

భారత గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మలిచేందుకు బహుళ అంచెలతో ఒక క్షిపణి రక్షణ కవచాన్ని భారత్ అభివృద్ధి చేసింది. దీర్ఘశ్రేణి క్షిపణులు, -మిగతా 2లో

## ఇక ఉగ్ర చర్యలను యుద్ధంగానే పరిగణిస్తాం - భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 10)

ఉగ్రవాదులు, వారికి మద్దతు పలికే వారికి భారత్ తాజాగా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. దేశంలో ఇక నుంచి ఎటువంటి ఉగ్రదాడులు జరిగినా 'యుద్ధ చర్య'గానే పరిగణిస్తామని స్పష్టం చేసింది. అందుకు తగు విధంగా స్పందిస్తామని భారత ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్-పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలునెలకొన్న వేళ ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో వరుసగా దాడులకు పాల్పడుతోంది. విమానాశ్రయాలు, సామాన్య -మిగతా 2లో



మొదటి పేజీ తరువాయి

# నీ అబద్ధం తాత్కాలికం...
# మా నిజం శాశ్వతం

పనిగా పెట్టుకున్నారు. అప్పుడు నేను ఎమ్మెల్యేనీ కూడా కాను. ప్రజల కోసమే పుట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, నా మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు స్వయం ఉపాధికి చేయూతనందించాలని నిర్ణయించుకున్నాను. మహిళలు, చేనేతలు, స్వర్ణకారులు, చిరువ్యాపారులకు అవసరమైన సామాగ్రి, ఆర్థిక సాయంతో చేయూతనందించాను. వీటన్నింటికీ నా సొంత నిధులు వెచ్చించాను. కుల, మత అంతరాలు పాటించకుండా... తమ కాళ్లపై తాము నిలబడాలనుకునే మహిళామణులు వేలాదిమందికి స్త్రీశక్తి పేరుతో ఉచితంగా శిక్షణ ఇచ్చి, ట్రైనింగ్ పూర్తయ్యాక సర్టిఫికెట్లు, ఉచితంగా టైలరింగ్ మిషన్, మెటీరియల్ అందజేశాను. మంగళగిరి స్త్రీ శక్తి కేంద్రం 2022 జూన్20 ప్రారంభించాం. ఈ కేంద్రం ఇప్పటివరకూ 43 బ్యాచ్ లలో 2226 మంది శిక్షణ పూర్తిచేసుకోగా, వీరందరికీ మిషన్లు అందజేశాం.తాడేపల్లిలో స్త్రీ శక్తి కేంద్రం 2023 ఫిబ్రవరి 1న ప్రారంభమైంది. ఇక్కడ 17 బ్యాచ్ లలో శిక్షణ తీసుకున్న 666 మందికి మిషన్లు ఉచితంగా ఇచ్చాం. దుగ్గిరాలలో 2023 ఏప్రిల్ 10న ఆరంభించిన స్త్రీశక్తి కేంద్రంలో 16 బ్యాచ్ లలో 616 మంది ట్రైనింగ్ పూర్తి చేసుకోగా, వీరందరికీ మిషన్లు పంపిణీ చేశాం. ఇప్పటివరకూ 3508 మందికి శిక్షణ పూర్తిచేసి, ఉచితంగా నాణ్యమైన కుట్టు మిషన్లు అందజేశాం. ఇవన్నీ నా జేబులోంచి తీసిన డబ్బులు, నా ఖాతాల నుంచి వెచ్చించిన సొమ్ములు కాబట్టే... శుభానికి సంకేతమైన నా పార్టీ పసుపు రంగు మిషన్లు ఇచ్చాను. జనం సొమ్ముతో పెట్టిన పథకాలకు నీలా పార్టీ రంగులు, నీ పేర్లు పెట్టుకోవాలనే యావ మాకు లేదు. నీ అబద్ధం తాత్కాలికం. మా నిజం శాశ్వతం" అంటూ లోకేశ్.

# కుదిరితే సాఫ్ట్ కిల్...
# లేకపోతే హార్డ్ కిల్...!

ఎదుర్కోవడానికి డీఆర్‌డీఓ యొక్క స్వదేశీ పరిష్కారమైన 4 వ్యవస్థ రూపుదిద్దుకుంది. దీనిని ఇప్పటికే త్రివిధ దళాలలో విజయవంతంగా ప్రవేశపెట్టారు.

**ఈ4 వ్యవస్థ పనితీరు:** శత్రువును లక్ష్యంగా చేసుకోవడానికి మరియు వారి రాడార్, వాయు రక్షణ సామర్థ్యాలను అంచనా వేయడానికి డ్రోన్లు తక్కువ ఖర్చుతో కూడిన మార్గం. వీటిని గుంపులుగా పంపడం ద్వారా, భారత్ యొక్క వాయు రక్షణ ఆయుధ నిల్వలను తగ్గించడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. అయితే, %ఈ%4 వ్యవస్థలోని నిర్దేశిత శక్తి లేదా లేజర్ ఆయుధాలను నిల్వలు అయిపోతాయనే భయం లేకుండా అనేకసార్లు ఉపయోగించవచ్చు. ఈ4 వ్యవస్థలో, డ్రోన్లను గుర్తించడం మరియు వర్గీకరించడం కోసం రాడార్, రేడియో ఫ్రీక్వెన్సీ డిటెక్షన్ వ్యవస్థలు మరియు ఎలక్ట్రో-ఆప్టిక్ ఐడెంటిఫికేషన్ వ్యవస్థల నుండి వచ్చే ఇన్‌పుట్‌ల కలయికను ఉపయోగిస్తారు. రేడియో ఫ్రీక్వెన్సీ జామింగ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ జామింగ్ మరియు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (%స్త్రఆఐ%) స్పూఫింగ్ వంటి పద్ధతుల ద్వారా డ్రోన్లను 'సాఫ్ట్ కిల్' పద్ధతిలో నిర్వీర్యం చేస్తారు. డ్రోన్లు స్వయంప్రతిపత్తి కలిగిన మానవరహిత వైమానిక వాహనాలు కాబట్టి, వాటి స్థానాన్ని, లక్ష్యాన్ని తెలుసుకోవడానికి జీపీఎస్‌పై ఆధారపడతాయి. భారతీయ 4 వ్యవస్థ ఈ సిగ్నళ్లను నిరోధించడానికి లేదా డ్రోన్లను తికమకపెట్టి గాలిలోనే నాశనం చేయడానికి సరిపడా అత్యాధునికమైనది.ఒకవేళ 'సాఫ్ట్ కిల్' పద్ధతి విఫలమైతే, శక్తివంతమైన లేజర్లను ఉపయోగించి 'హార్డ్ కిల్' పద్ధతిలో అధిక శక్తి నిర్దేశిత ఆయుధంతో డ్రోన్‌ను కూల్చివేస్తారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ యొక్క ప్రముఖ ప్రయోగశాల, సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్ సైన్సెస్ దీని అభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది.భారతీయ %ఈ%4 వ్యవస్థను వాహనాలపై లేదా స్థిరంగా అమర్చవచ్చు, దీనికి సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఉంటుంది. వాహన ఆధారిత వెర్షన్లను యుద్ధ వాతావరణంలో చురుకుగా ఉపయోగిస్తుండగా, స్థిర యూనిట్లను కీలక సైనిక స్థావరాల వద్ద మోహరించారు. స్థిర 4 వ్యవస్థ 360-డిగ్రీల కవరేజీని అందిస్తుంది మరియు చిన్న డ్రోన్లను కూడా కూల్చివేయగలదు.'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి అనుగుణంగా, 4 వ్యవస్థను దేశంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తో పాటు అనేక భారతీయ పరిశ్రమల సహకారంతో తయారు చేస్తున్నట్లు డీఆర్‌డీఓ తెలిపింది. వివిధ రకాల డ్రోన్లపై ఈ వ్యవస్థ సమర్థతను హోం మరియు రక్షణ మంత్రిత్వ శాఖల క్రింద ఉన్న పలు భద్రతా సంస్థలు ఆమోదించాయి. కొన్ని ఇతర దేశాల రక్షణ దళాలకు కూడా దీనిని ప్రదర్శించారు.

# నేడు శ్రీసత్యసాయి జిల్లాలో
# మంత్రి లోకేశ్ పర్యటన

సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. అయితే, ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయారు. ఆయన పార్థివ దేహం ఈరోజు స్వగ్రామానికి చేరుకోనుంది. మురళీ నాయక్ మృతితో స్వగ్రామం కల్లి తండాలో విషాదం అలుముకుంది.

# పాకిస్థాన్‌కు షాక్..
# భారత్ కీలక నిర్ణయం

రాత్రి సమయాల్లో ఉత్తర భారతదేశంలోని పలు సైనిక స్థావరాలు, పౌర నివాసిత ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే, భారత పటిష్టమైన వాయు రక్షణ వ్యవస్థ ఈ దాడులను పూర్తిగా అడ్డుకోగలిగింది.రెండు వారాల క్రితం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్ సంబంధిత ఉగ్రవాదులు జరిపిన కిరాతక దాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ దారుణ ఘటనకు ప్రతిస్పందనగా, భారత్ పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై ఖచ్చితమైన క్రూయిజ్ క్షిపణులతో దాడులు నిర్వహించింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి.

# బహుళ అంచెల కవచం..
# భారత గగనతలం

డ్రోన్లు, గాల్లోనే కొన్నిగంటలు నిలిచి ఉండి, అదునుచూసి దెబ్బకొట్టే లాయిటరింగ్ మ్యునిషన్ల బారి నుంచి రక్షణ కల్పించేలా దీన్ని తీర్చిదిద్దింది. భిన్న శ్రేణుల్లో, భిన్న ఎత్తుల్లో శత్రు అస్త్రాలను అడ్డుకునేలా దీన్ని తయారుచేసింది. ఈ వ్యవస్థను భారత వైమానిక దళంలోని సమీకృత గగనతల ఆదేశిక, నియంత్రణ వ్యవస్థ (ఐఏసీసీఎస్) సమన్వయం చేస్తుంటుంది. ఇందులో రాడార్లు, సెన్సర్లు, ఆదేశిక పోస్టులను హైస్పీడ్ ఆప్టిక్ ఫైబర్‌తో అనుసంధానం చేశారు. ఫలితంగా ఇందులోని అన్ని ఆయుధాలూ సమన్వయంతో పనిచేస్తాయి. శత్రువుల అస్త్రాల గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించడానికి, వేగంగా స్పందించడానికి వీలవుతుంది.

# ఇక ఉగ్ర చర్యలను యుద్ధంగానే
# పరిగణిస్తాం - భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

పౌరులే లక్ష్యంగా దాయాది ఈ చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులతో శనివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

# విశ్రాంత ఉపాధ్యాయుడు
# ఆర్ జానకిరామిరెడ్డికి నివాళి



**(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, మే 10)** విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.జానకిరామిరెడ్డి ఈ నెల 9వ తేదీ స్వర్గస్తులైనందున శనివారం బేస్తవారపేట విశ్రాంత ఉద్యోగ సంఘ సభ్యులు సంఘ కార్యాలయంలో సమావేశమై సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న
# సాంఘిక సంక్షేమ శాఖ
# మంత్రి స్వామి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 10)** మండలంలోని చప్పిడి లక్ష్మీనరసింహ కుమార్తె హరిత వివాహ కార్యక్రమానికి శనివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని వధువుని ఆశీర్వదించారు .ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండల





టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, పల్లపోతు రమేష్ బాబు,మండవ మురళీమోహన్, గుమ్మళ్ళ వెంకట్రావు, పిల్లి వెంకటనారాయణ, ఉన్నం బసవయ్య, కాటూరి మాధవ, కాటూరి వెంకటేశ్వర్లు, తాసిల్దార్ వి పుల్లారావు, తదితరులు ఉన్నారు.

# డీఎస్సీ నోటిఫికేషన్‌లో
# సవరణలు చేయాలి

## భారత ప్రజాతంత్ర యువజన సంఘం
## ఆధ్వర్యంలో ఒంగోలులో నిరసన




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో సవరణలు చేయాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు నందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. డీవైఎఫ్‌వై ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో డీఎస్సీ అభ్యర్థులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా డైఫీ జిల్లా కార్యదర్శి బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నియామకాలు చేపట్టడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు, అయితే డీఎస్సీ నోటిఫికేషన్‌లో కొన్ని సవరణలు చేపట్టి అభ్యర్థులకు వెసులుబాటు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు, ప్రధానంగా డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కనీసం 90 రోజులు చదువుకునే సమయాన్ని కల్పించడంతో పాటుగా డీఎస్సీ నోటిఫికేషన్ లో వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని కోరారు, వాటితో పాటుగా ఒక జిల్లాకు ఒకే పేపర్ ను కేటాయించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్ నందు సవరణలు చేపట్టి నిరుద్యోగలకు వెసులుబాటు కల్పించేలా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు చొరవ తీసుకోవాలని డీఎస్సీ అభ్యర్థులు విన్నవించారు.

# అన్ని వర్గాల ప్రజలను
# కూటమి ప్రభుత్వం మోసం చేస్తుంది

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 10)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ స్కీం రచించినా దానివెనుక స్కాం తప్పకుండా ఉంటుంది. దానికి చరిత్రలో ఎన్నో వందల ఉదాహరణలున్నాయని వైసీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు సునంద అన్నారు. శనివారం ఆమె జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కొత్తగా మరో స్కాం బయటకొచ్చింది. బలహీనవర్గాల మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని చెప్పుకుంటూ కూటమి ప్రభుత్వం భారీ అవినీతికి తెరదీసింది. చంద్రబాబు మాటలకు చేతలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. పేదల పేరుతో సంపద కొల్లగొట్టడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు. పేదలకు లబ్ధి చేకూర్చినట్టు పైకి చెప్పుకుంటూ ఆయన ఆయన మనుషులు లాభపడతారు. చంద్రబాబు ఐటీ తెచ్చానని చెప్పుకుంటారు. ఏఐ టెక్నాలజీ గురించి మాట్లాడతారు. డ్రోన్లు వాడాలంటాడు. ప్రతి ఇంట్లో ఒక ఐటీ ఉద్యోగి ఉండాలంటాడు. చివరికి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తాడు. కుట్టు మిషన్ల పంపిణీ ద్వారా వారిని ఏ విధంగా ఐటీ ఉద్యోగులను చేస్తాడో అర్థంకాని పెద్ద శేష ప్రశ్న. కుట్టుమిషన్ల పంపిణీ పేరుతో తన అనుచరుల జేబులు మాత్రం బాగానే నింపుతున్నారు.

**ఒక్కో లబ్ధిదారు పేరుతో రూ. 16 వేలు దోపిడీ**

రూ. 221 కోట్లతో కూటమి ప్రభుత్వం కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. 1,02,832 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందించే పేరుతో చేపట్టిన స్కీమ్‌లోదాదాపు రూ.154 కోట్లకు పైగా దండుకోవడానికి సిద్ధమైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న మహిళలకు శిక్షణ ఇస్తామని చెప్పిన చంద్రబాబు, ఆ పనులు ప్రారంభించకుండా దోపిడీకి మాత్రం డోర్లు బార్లా తెరిచారు. 1,02,832 మంది మహిళలకు శిక్షణ కోసం మొత్తం రూ. 221.08 కోట్లు కేటాయించారు. ఇందులో కుట్టుమిషన్‌కి రూ. 4300, ఒక్కో మహిళకు శిక్షణ కోసం రూ. 3 వేలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఈ విధంగా మొత్తం అయ్యే ఖర్చు రూ. 75.06 కోట్లే. మిగిలిన రూ. 154 కోట్లకు మాత్రం లెక్కలే లేవు. ఒక్కో లబ్ధిదారు పేరు మీద దాదాపు రూ. 16 వేల వరకు దోపిడీకి పాల్పడుతున్నట్టు స్పష్టంగా అర్థమవుతుంది.

**మొబిలైజేషన్ అడ్వాన్సు పేరుతో రూ. 25 కోట్లు**

శిక్షణ పేరుతో 50 రోజుల్లోనే మొత్తం బిల్లులు కింద లాగేసేందుకు పథకం రూపొందించారు. టెండర్ నిబంధనల ప్రకారం బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళలకు టైలరింగ్ శిక్షణ ప్రారంభమైన 15 రోజులకు 33 శాతం, 30 రోజులకు మరో 33 శాతం, 50 రోజులకు మిగిలిన 33 శాతం బిల్లులు చెల్లించాలి. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా పూర్తిస్థాయిలో కుట్టు శిక్షణే ప్రారంభం కాలేదు. మొబిలైజేషన్ అడ్వాన్సు కింద రూ.25 కోట్లను కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. నీకింత.. నాకింత రూల్ ప్రకారం ప్రభుత్వ ఖజానాను

మీడియా సమావేశంలో వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు సునంద ఫైర్
బీసీ మహిళలను అడ్డం పెట్టి భారీ దోపిడీ
ఏ పథకం చూసినా అవినీతి మయమే
కుట్టు మిషన్ల శిక్షణ పేరుతో రూ. 154 కోట్లకు స్కెచ్
ఐటీ, ఏఐ టెక్నాలజీ పేరు చెప్పి కుట్టుమిషన్లు పంచాడు
ఆ మిషన్లు ఇచ్చే పేరుతో కోట్లు కొల్లగొడుతున్నారు
టెండర్ల దశ నుంచి శిక్షణ వరకు ప్రతిదీ అవినీతే
జేబులు నింపుకునే స్కీం




దోచుకోవడానికి బీసీ మహిళలను పావులుగా వాడుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో లబ్ధిదారుకి 45 రోజులపాటు దాదాపు 360 గంటల శిక్షణ ఇవ్వాల్సి ఉంటే, కేవలం 135 గంటల మాత్రమే శిక్షణ ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారులబ్ధిదారులకు ట్రైనింగ్ కిట్ కూడా ఇవ్వడం లేదు.

**పేరున్న శిక్షణ సంస్థలను కాదని...**

కుట్టు శిక్షణ ఇచ్చేందుకు సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్), ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, సాంకేతిక కన్సల్టెన్సీ సంస్థ (ఏపీఐటీసీవో)తో పాటు కేంద్ర సంస్థ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన (డీడీయూజీకేవై) ఉన్నాయి. వీటికి శిక్షణ కేంద్రాలు, శిక్షణ భాగస్వాములు ఉన్నారు. స్కిల్ పోర్టల్స్, అన్ని జిల్లాల్లో పర్యవేక్షణ వ్యవస్థ, సిబ్బంది సైతం ఉన్నారు. అయినా వాటిని కాదని ఆంధ్రప్రదేశ్ బీసీ సహకార ఆర్థిక సంస్థ ద్వారా స్కీమ్‌ను చేపట్టి భారీ స్కామ్‌కు మార్గం సుగమం చేసుకున్నారు. ఈ స్కీమ్ రచనలో కీలకపాత్ర పోషించిన ఒక రిటైర్డ్ అధికారికి తగిన ప్రోత్సాహకం ఇచ్చారని నాకు సమాచారం ఉంది.

**టెండర్లలోనూ మాయాజాలం :** దోచుకోవడమే లక్ష్యంగా ఈ పథకాన్ని సిద్ధం చేసిన చంద్రబాబు, టెండర్ల దశ నుంచే చక్రం తిప్పడం మొదలైంది. ప్రి బిడ్‌లో మొత్తం 65 కంపెనీలు పాల్గొంటే 56 సంస్థలను ముందే తిరస్కరించారు. కుట్టు శిక్షణలో విశేష అనుభవంతో పాన్ ఇండియా కంపెనీగా గుర్తింపున్న ఐసీఏ కూడా ఇందులో ఉండటం విచిత్రం టెండర్లలో తక్కువ మొత్తానికి కోట్ చేసిన సంస్థను కాదని అంతకంటే ఎక్కువకు కోట్ చేసిన మరో రెండు సంస్థలను కలిపి రంగంలోకి దించారు. మిగిలిన 9 కంపెనీల్లో ఆరు సంస్థల టెండర్లను తెరవకముందే తమదైన శైలిలో పక్కకు తప్పించేశారు. అంటే.. మొత్తం 65 కంపెనీల్లో 62ను తొలగించేశారు. ఇది కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందే. చంద్రబాబు ప్రభుత్వం తమవారికి శిక్షణ కాంట్రాక్టు అప్పగించడానికి ఇన్ని అడ్డంకులు పెట్టినా తట్టుకుని.. శ్రీ టెక్నాలజీ తక్కువ మొత్తానికి కోట్ చేసి ఎల్1గా నిలిచింది. కానీ, దానిని బెదిరించి 5 శాతం పని మాత్రమే అప్పగించారు. ఎల్2, ఎల్3గా నిలిచిన సంస్థలకు మాత్రం 95 శాతం పని ఇచ్చారు. గతంలోనూ ఆదరణ పేరుతో మిషన్ పంపిణీ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం మహిళలను వంచించారు. వైయస్ జగన్ హయాంలో మహిళలను తలెత్తుకుని జీవించేలా పథకాలను రూపొందించడం జరిగింది. ఈబీసీ నేస్తం, జగనన్న చేయూత, ఆసరా, అమ్మ ఒడి పథకాల ద్వారా మహిళలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచారు. బీసీల జీవితాల్లో వెలుగులు నింపితే, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలను అడ్డం పెట్టుకుని భారీ దోపిడీకి పాల్పడుతోంది. ఈ సమావేశంలో జిల్లా అంగన్వాడీ వింగ్ అద్యక్షురాలు పాల లావణ్య, నెల్లూరు రూరల్ మహిళా విభాగం అద్యక్షురాలు పి రమాదేవి, మహిళా నాయకురాళ్ళు భషీరా , హైమవతి, నర్మదా, తదితరులు పాల్గొన్నారు



## సొసైటీకీ సొమ్ము చెల్లించి షాపులు నడుపుకుంటున్నాం

గ్రీన్ బెల్ట్ పేరుతో దుకాణాల తొలగింపు దారుణం

మున్సిపల్ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేసిన చిరు వ్యాపారులు

తొలగింపును అడ్డుకున్న చిరు వ్యాపారులు

4

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ఉపాధిలో నిలువు దోపిడీ ?

అధికారి రూటే సపరేటు

రూ.300 ఇస్తేనే మస్టర్లు కొట్టిస్తాం లేదంటే వెనక్కే

లబోదిబో మంటున్న ఉపాధి కూలీలు






(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మే 10)

అంతా నా ఇష్టం...నాకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయి...నన్ను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా వ్యక్తం చేస్తున్నాడు సదరు అధికారి... గత వైసీపీ ప్రభుత్వంలో ఇదే నియోజకవర్గంలో మరుగుదొడ్ల నిర్మాణాల్లో భారీగా అవకతవకలకు పాల్పడి లక్షలు పోగేసుకున్నాడు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను దోచుకున్న సొమ్మును కొంత మేర అధికార పార్టీ నేతలకు ముడుపుల రూపంలో అందజేసి తిరిగి నియోజకవర్గంలో అధికారం చేపట్టారు. ఇక తనను అడ్డుకునే వారు లేరనే ధైర్యం హెచ్చుమీరింది. పార్టీ ఏదైనా తన సీటు పదిలం అనే స్థాయిలో అధికారి పనులు చక్కబెడుతున్నారు. అధికారం చేపట్టిన రోజుల వ్యవధి నుంచే తన చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్న ఇలాంటి అధికారులకు స్థానిక టీడీపీ నేతలు వత్తాసు పలుకుతూ సదరు అధికారికి రెండు మండలాలు అప్పగించారంటే వారి మధ్య ఏ స్థాయిలో సంబంధాలు కొనసాగుతున్నాయో ఈ ప్రాంత ప్రజలకు స్పష్టం అవుతుంది. మరి కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్న ఈ మండల అధికారిని తొలగిస్తారో ఇలాగా కొనసాగుతారో కాలమే నిర్ణయించాలి మరి....!

వివరాల్లోకి వెళితే ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వారు తట్ట పట్టరు. మట్టి పనులు ఎలా ఉంటాయో వారికి తెలియదు. కూలి పనులు ఎలా ఉంటాయో వారికి అర్థం కాదు. కానీ ఉపాధి హామీ పథకంలో బాధ్యతలు నిర్వహిస్తున్న చిరుద్యోగులు, కూలీల పై వారి కష్టార్జితంలో భాగస్వామ్యం పంచుకుంటున్న నియోజకవర్గంలోని ఓ మండల ముఖ్య అధికారి పనితీరుపై ఆ శాఖ సిబ్బందితో పాటుగా పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో ఆ అధికారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి వివాదాస్పదంగానే మారింది. గతంలో ఇదే నియోజకవర్గంలోని ఒక మండలంలో బాధ్యతలు నిర్వహించిన అధికారి మరుగుదొడ్ల నిధులు స్వాహా చేసి ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురయ్యారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నేనున్నానంటూ ఓ ముఖ్య నేత అండతో మరలా అధికారాన్ని చేపట్టారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తన సత్తా చూపెడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో ఉన్న ప్రతి కూలి నమోదు కావాలంటే రూ.300 చెల్లించవలసిందే అంటూ ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా తమ సొంత మనుషులను ఏర్పాటు చేసుకొని మండలంలో జరుగుతున్న ఉపాధి పనులకు ఒక కిరణాన్ని పంపి అందులో వెలుగును చూస్తున్నారు. ఆ కిరణం ఆయా ప్రాంతాలలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలలో హాజరవడమే కాక సంబంధిత క్షేత్ర సహాయకులను కూలీలను పనులకు హాజరైన ప్రతి ఒక్కరు రూ.300 చెల్లించవలసిందే అంటూ అల్టిమేటం జారీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్లే మేట్లు ప్రతీవారం వసూళ్లు చేసి ఆ అధికారికి అప్పగిస్తున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన క్షేత్ర సహాయకులు మాత్రం ఇటువంటి అధికారి ఉపాధి హామీ పథకంలో ఉంటారా అని మధనపడుతూ బాధ్యతల నుండి తప్పుకుంటేనే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నారు. ఆ అధికారి బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి నియోజకవర్గంలోని ఆ మండలం పూర్తిస్థాయిలో అభాసు పాలయిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. తగుదునమ్మ అంటూ అధికారి మరొక ప్రాంతానికి వెళ్లి అదనపు బాధ్యతలు స్వీకరించారు. రెండు మండలాలలో సదరు అధికారి బాధ్యతలు స్వీకరించడంతో రెండు మండలాల ఉద్యోగులు ఇటువంటి అధికారిని ప్రభుత్వం ఎందుకు నియమించింది అంటూ వారు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలోని ఒక మండలంలో ఉపాధి హామీ పథకంలో 15 వేల మంది కూలీలు ఉంటే వారి నుంచి ఒక్కోరి దగ్గర రూ.300 చొప్పున సంబంధిత అధికారి వారానికి వసూలు చేస్తే 45 లక్షలు పొందుతారు. ఉపాధి హామీ కూలీల పని దినం 90 రోజులు అయితే 12 వారాలకు సంబంధించి ఐదు కోట్ల పై చిలుకు అక్రమార్జన ఒక్క మండలంలోని జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి మరో అడుగు ముందుకు వేసి మరొక ప్రాంతానికి సైతం అదనపు బాధ్యతలు స్వీకరించారు. తాను ఇతరులకు సైతం చెల్లించుకుంటానంటూ బహిరంగంగానే ఆ అధికారి బాహాటంగానే వ్యాఖ్యానించడం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తుంది. గతంలో సైతం సదరు అధికారి మరుగుదొడ్ల కుంభకోణంలో సైతం పావులుగా మారి ఉన్నారు. ఒక్క మండలంలోని పరిస్థితి ఈ విధంగా ఉంటే రెండు మండలాలలో ముడుపుల కుంభకోణం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ అధికారి మాత్రం తనకు పూర్తిస్థాయిలో అధికార పార్టీ నేతల మద్దతు ఉందని, తాను చేసే ప్రతి తప్పుకు ఖచ్చితంగా జిల్లా స్థాయిలో తోడ్పాటు లభిస్తుందని బహిరంగంగానే అంటున్నారు. అంటే ఈ అధికారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు స్వచ్ఛందంగా పనులకు హాజరైన కూలీలు మాత్రం తాము పనులు చేసినా కూడా రూ.300 ఎందుకు చెల్లించాలని సంబంధిత క్షేత్ర సహాయకులను ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలోని ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి అవకతవకల పై జిల్లా అధికారులు దృష్టి సారించి అవినీతి అధికారి పై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందితో పాటు కూలీలు కోరుతున్నారు.

## నేరస్తులకు శిక్ష పడే విధంగా నైపుణ్యం పెంపొందించుకోవాలి

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

ప్రతి పోలీస్ స్టేషన్‌లలో నమోదవుతున్న కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలంటే దర్యాప్తు అధికారులు నేర స్థలం నుంచి శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించడం, వాటిని పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం చాలా ముఖ్యమని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లాలో పని చేస్తున్న దర్యాప్తు అధికారులకు ఫారెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై ప్రముఖ నిపుణులచే ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ మాట్లాడుతూ ప్రతి దర్యాప్తు అధికారి మంచి నైపుణ్యం కలిగి ఉండాలని రాష్ట్ర డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా, ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ పై ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి రోజు స్టేషనుల్లో నమోదవుతున్న క్రిమినల్ కేసుల్లో పోలీస్ అధికారికి ఏదో ఒక రూపంలో సవాలు ఎదురవుతూనే ఉంటుంది. నేరం జరిగే తీరు ఆధారంగా కొన్ని క్లిష్టతరమైనదిగా, మరికొన్ని సులభతరంగా ఛేదించే విధంగా ఉంటాయని, కానీ ఒక నేరం జరిగిన తీరును బట్టి ఏ విధంగా జరిగింది, దానిని ఎవరు చేశారు, నేరానికి దారి తీసిన అంశాలు మొదలైనవి తెలుసుకునేందుకు ప్రతి పోలీసు అధికారి సంపూర్ణ నిష్ణాతుడు కావాలని, నేర స్థలం నుండి ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, వాటిని ప్యాకింగు చేయడం, పరీక్షల కొరకు సకాలంలో ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం చాలా ముఖ్యమైన విషయమన్నారు. నేరం చేసిన నిందితులు ఎట్టి పరిస్థితుల్లో శిక్ష నుండి తప్పించుకోకూడదని, నేరం చేసిన వారికి చట్ట ప్రకారం తప్పకుండా శిక్ష పడాలి అంటే నేరస్థుడు నేర స్థలంలో వదిలిన భౌతిక సాక్షాధారాలను సేకరించే సమయంలో పాటించవలసిన నియమ నిబంధనలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో సాక్ష్యాలను సేకరించే విధానం వంటి అంశాలపై ప్రతి అధికారి మంచి నైపుణ్యం కలిగి ఉండాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నేర్చుకున్న ప్రతి అంశం దర్యాప్తు వేగవంతంగా పూర్తి అవ్వడానికి, (తరువాయి 4లో...)

## మే 20 న నిర్వహించే కార్మిక, కర్షక సమ్మెను విజయవంతం చేయండి

నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

సి 2౦50 ప్రకారం పంటల మద్దతు ధరల చట్టం చేయాలి

కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం

ఎకరాకు రూ. 20 వేలు వెంటనే విడుదల చేయాలి

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలి

నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయాలి

ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా

ధాన్యం, పొగాకు, శనగ, మిర్చి, మినుము పంటలు కొనుగోలు చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో పలువురు నేతల డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక లోకం నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ప్రజలంతా విలువగా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని కామ్రేడ్ నారాయణ స్వామి భవన్లో శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ ఈనెల 20 తేదీన నిర్వహించే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెకు దేశంలోని అన్ని రైతు సంఘాలు సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది అన్ని పంటల ధరలు పడిపోయి రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందన్నారు. ధాన్యాన్ని రూ. 4 వందల తక్కువ ధరకు అమ్ముతున్నారు. సగటున్న 18వేలు అమ్మిన మిర్చి ధర ఈ ఏడాది 9000 కు పడిపోయింది అన్నారు. పత్తిని 2వేలు కన్నా తక్కువ అమ్ముతున్నారు. బర్లీ పొగాకును కొనే నాధుడే లేరన్నారు. అపరాలు, రొయ్యలు, జీడి పిక్కలు, (తరువాయి 4లో...)



# మే 20 న నిర్వహించే కార్మిక, కర్షక సమ్మెను విజయవంతం చేయండి

కోకో గింజల ధరలు కంపెనీల దయా దక్షిణ్యాలపై ఆధారపడి ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంటల ధరల విషయంలో కలుగజేసుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ధరల స్థిరీకరణ నిధిని రద్దు చేసిందన్నారు. ప్రభుత్వ కొనుగోలు నిలిపివేసిన ఫలితంగా కంపెనీలు, వ్యాపారల ఇష్టారాజ్యంగా తయారయ్యిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడు నెలల వ్యవసాయ చట్టాల రద్దు సందర్భంగా పంటల మద్దతు ధరల చట్టం చేస్తానని హామీ ఇచ్చిందన్నారు. రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలుపరచకుండా రైతాంగానికి తీరని ద్రోహం చేసిందన్నారు. మద్దతు ధరల విధానం లేకుండా నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ పేరుతో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, బహుళ సహకార సంస్థల చట్టం పేరుతో మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల హస్తగతం చేయటానికి ఈ విధానాలను రూపొందించిందని ధ్వజమెత్తారు. ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులతో పాటు కర్షకులు కూడా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె .వీరారెడ్డి మాట్లాడుతూ రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు కేంద్రం అవలంబిస్తున్న కార్మిక కర్షక విధానాలను ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు. పంటలకు సి2 ప్లస్ 50 మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె జయంతి బాబు మాట్లాడుతూ రైతుల, వ్యవసాయ కార్మికుల, కౌలు రైతుల రుణాలను రద్దు చేయాలన్నారు. కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం తేవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి ఎకరాకు రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కె నాంచార్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విప్లవ రైతు సంఘం నాయకులు భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూ పొగాకు, మిర్చి పంటలను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. అలాగే రోజువారి కూలీ రూ. 600 ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధీర్ మాట్లాడుతూ పాల రైతులకు లీటరుకు రూ. 10 ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న 44 చట్టాలను, హక్కులను నిర్వీర్యం చేసి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. ఐఎఫ్టియు నాయకులు ఆర్ మోహన్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలన్నారు. బహుజన ఉద్యోగుల సంఘం నాయకులు సలార్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# సొసైటీకి సొమ్ము చెల్లించి షాపులు నడుపుకుంటున్నాం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)**

రాంనగర్ సొసైటీకి రూ.4 లక్షలు చెల్లించి చిరు వ్యాపారులు జరుపుకుంటున్నామని రోడ్డు పక్కన షాపులు నడుపుతున్న చిరు వ్యాపారులు లబోదిబో మంటున్నారు. ఎన్నో సంవత్సరాల నుండి రోడ్డు వెంబట చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాంనగర్ మెయిన్ రోడ్డులో ఉన్న దుకాణాలను శనివారం మున్సిపల్ అధికారులు తొలగింపు చర్యలకు పూనుకున్నారని ఆ ప్రాంతవాసి డి పేరయ్య తెలిపారు. ఒంగోలు నగరపాలక సంస్థ గ్రీన్ బెల్ట్ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్న వాటిని తొలగించేందుకు ప్రయత్నం చేయగా స్థానికులు గ్రీన్ బెల్ట్ నిర్మాణం చేపట్టేందుకు గతంలో ఆ ప్రాంతంలో ఉన్న కొన్ని నివాసాలను షాపులను తొలగించారు అయితే కొందరు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చుకొని వ్యాపారాలు చేసుకుంటు నివసిస్తున్నామని కొంతమంది చిరు వ్యాపారాలు చేసుకుంటున్నామని అన్నారు. మునిసిపల్ కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడకు వెళ్లి ఒక్కసారిగా షాపులు తొలగించే కార్యక్రమం చేపట్టారు. షాపులు లేకపోతే తాము వీధిన పడతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు రాంనగర్ సొసైటీకి ఒక్కొక్కరం రూ.4 లక్షల చెల్లించి కొనుగోలు చేసుకున్నామని వాటికి సంబంధించిన దస్తావేజులు కూడా ఉన్నాయని వారు తెలిపారు. కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చిన, స్టే ఆర్డర్ ఉన్నప్పుడు అధికారులు తొలగింపు చర్యలు వెంటనే విరమించుకోవాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు కలగజేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. అయితే ఒక మహిళ తాను చిన్నతనంలోనే ఇక్కడ కొనుగోలు చేసుకుని నివాసం ఉన్నానని, అప్పుడు తనకు 90 ఏళ్ళ వరకు రాసిచ్చారని, ఎప్పటి నుంచో ఈ ప్రాంతంలో ఉంటే ఇప్పుడు అధికారులు కావాలని మమల్ని తొలగింపు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. షాపులు, ఇళ్లను తొలగించకుండా ఆపాలని వేడుకుంటున్నారు. ఆ ప్రాంతంలోని 11 షాపులకు సంబంధించిన వారందరూ నగరపాల సంస్థ అధికారులను అడ్డుకోవడంతో అధికారులు అక్కడినుండి వెళ్లిపోయారు. మరల తమ పైకి అధికారులు ఎవరూ రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి, మా షాపులు, నివాసాలను తొలగించుకోవాలని కోరారు.






# దేశ రక్షణ నిధికి ప్రవీణ్ విరాళం అభినందనీయం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

## రూ.25,000 చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేత





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 10)

దేశ రక్షణ నిధికి కాకుమాని ప్రవీణ్ కుమార్ రూ.25,000 విరాళం ఇవ్వడం ఎంతో అభినందనీయమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కందుకూరు టిడిపి కార్యాలయంలో, శ్రీ సత్య సాయి జ్యువెలర్స్ యజమాని కాకుమాని ప్రవీణ్ కుమార్ ఈ విరాళాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం 24 గంటలూ అప్రమత్తంగా ఉండే మన సైనికుల ధైర్య సాహసాలను మనం ఎప్పటికీ మరిచిపోవద్దు. వారు కాపాడే గౌరవంతోనే మనం కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితం గడుపుతున్నాం. దేశ భద్రత కోసం మనం చేసే సహాయం, విరాళాలు వారికి అండగా నిలుస్తాయని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ రక్షణ వ్యవస్థ బలోపేతంగా పనిచేస్తుంది అన్నారు. కాకుమాని ప్రవీణ్ కుమార్ గారు మాట్లాడుతూ, 1971లో భారత్ -పాకిస్తాన్ యుద్ధ సమయంలో అన్న ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన నిధిని గుర్తు చేసుకుంటూ, ఆయన స్ఫూర్తితోనే నేను ఈ విరాళాన్ని అంద చేస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు వెంకట సుధాకర్, తాత లక్ష్మీనారాయణ, కోట వెంకట నరసింహం, కోటా కిషోర్, ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, చక్కా వెంకట కేశవరావు, కంకణాల వెంకటేశ్వర్లు, కొత్త నరేంద్ర, ఇన్నమూరి నరసింహ, పబ్బిశెట్టి వరదరాజ, కటకం నరసింహారావు, గుర్రం అల్లూరయ్య, ఇస్కాల మధు, మద్ది ప్రసాద్, చల్లగాలి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తులకు శిక్ష పడే విధంగా నైపుణ్యం పెంపొందించుకోవాలి




నేరస్థులకు త్వరితగతిన శిక్షపడేలా చేయడానికి, సహాయపడుతుందని ఎస్పీ తెలిపారు. నేర స్థలంలో డి.ఎన్.ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలు, వెంట్రుకలు,నార్కోటిక్స్,మత్తు పధార్థాలు, వివిధ రకాల విషాలు, సైబర్ నేరాలలో పాటించవలసిన అంశాలు, ఆడియో, వీడియో, వివిధ పత్రాలు,భౌతిక సాక్ష్యాధారాలును ఏవిధంగా సేకరించాలి, ప్యాకింగ్, నిల్వ, భద్రపరచడం,లెటర్ ప్రిపేర్, ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదికను పొందే విధానం పాటించవలసిన మెలకువలు గురించి తెలిపారు.




సేకరించిన సాక్షాధారాలను ఏ విధంగా భద్రపరచాలి, భద్రపరిచిన వాటిని ఫారెన్సిక్ ల్యాబ్ లకు పంపే సమయంలో ఎలా ప్యాకింగ్ చేయాలి. ఆ ఆధారాల ద్వారా ఎలాంటి సమాచారం కోరుకుంటున్నమో ఎలా తెలియజేయాలి వంటి అంశాలను గూర్చి విపులంగా వివరించారు. సాక్ష్యాల సేకరణలో చేయకూడని పొరపాట్లు గురించి విపులంగా విశదీకరించారు. నిపుణులు తెలియజేసిన అంశాలకు గురించి, పోలీస్ అధికారులు వారికున్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్బీ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, మంగళగిరి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు పి కల్పన, కె రవికుమార్, కె శిరీష, పి కల్పన సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార ఆర్భాటాలు తప్ప

# మంత్రి నారాయణ నగరానికి చేస్తుంది ఏమీ లేదు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 10)**

ప్రచార ఆర్భాటాలు తప్ప.. మంత్రి నారాయణ నెల్లూరు నగరానికి చేస్తున్నది ఏమీ లేదని ,వాస్తవ వివరాలతో ధ్వజమెత్తిన జిల్లా యువజన అధ్యక్షుడు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున అన్నారు. నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గం కార్యాలయంలో వైసీపీ జిల్లా యువజన అధ్యక్షులు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ మంత్రి నారాయణకు పబ్లిసిటీ పిచ్చి పట్టుకుందన్నారు. అందుకే భగత్ సింగ్ కాలనీలో 1400 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నామని డప్పు కొట్టుకుంటున్నాడని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో భగత్ సింగ్ కాలనీకి వరదలు వచ్చిన సమయంలో మా నాయకుడు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.వచ్చి.. కాలనీవాసుల పరిస్థితిని చూసి.. వరదల నుంచి శాశ్వత రక్షణ కల్పించేలా 100 కోట్ల రూపాయలు రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలోనే అక్కడ 3500 కుటుంబాలకు పొజిషన్ సర్టిఫికేట్.. ఇవ్వవలసిందిగా జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో.. వారందరికీ ఆరోజే పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. కేవలం వైసీపీ ప్రభుత్వంలోని.. 90% రిటర్నింగ్ వాల్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ లోపల ఎన్నికలు రావడంతో.. పనులు కొంత ఆలస్యం అయ్యాయన్నారు. ప్రస్తుతం భగత్ సింగ్ కాలనీ వద్ద రిటర్నింగ్ వాల్ పనులు పూర్తి కావడంతో.. వైసిపి వాళ్ళకి ఈ క్రెడిట్ ఎక్కడ వెళ్తుందా అన్న.. భావనతో.. మంత్రి నారాయణ ఆగ మేఘాల మీద ఇళ్ల పట్టాల కార్యక్రమాన్ని తెరమీదకు తెచ్చారన్నారు. ఆరోజు వైసిపి ప్రభుత్వంలో రిటర్నింగ్ వాల్ నిర్మాణం జరగకుండా.. బాధితులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఉంటే శనివారం మంత్రి నారాయణ పేద ప్రజలకు ఇళ్ళ పట్టాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టేవారా అని ప్రశ్నించారు. ఏది ఏమైనా అక్కడ స్థానికులకు ఇళ్లపట్టాలివ్వడం.. సంతోషకరమన్నారు. 2019-24 ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ కాలంలోలోనే.. నెల్లూరు నగరంలో అభివృద్ధి జరిగిందని.. దీనికి తెలుగుదేశం పార్టీ నేతలు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.



ఈరోజు ..నెల్లూరులో పార్కుల మంత్రిగా.. పిలిపించుకునే నారాయణ.. వైసీపీ ప్రభుత్వంలో.. నిర్మించిన 13 డివిజన్ లోని మూడు పార్కులను.. తాను అభివృద్ధి చేసినట్టుగా బిల్డప్ ఇచ్చుకుంటున్నాడని అన్నారు. 13వ డివిజన్‌లో మూడు పార్కుల్లో.. వైసిపి ప్రభుత్వం లోనే పూర్తిస్థాయిలో పనులు పూర్తయినప్పటికీ.. ఎన్నికల్లో టిడిపి గెలిచిన తర్వాత మంత్రి నారాయణ ఆ పార్కులో పనిచేస్తున్న సిబ్బందిని బలవంతంగా తొలగించి.. ఈరోజు ఆ పార్కులను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈరోజు మళ్లీ 13 డివిజన్‌లో తన పార్టీ నాయకులకు రూ.50 లక్షల రూపాయల కాంటాక్ట్ పనులు అప్పగించి వారి నాయకులకు లబ్ది చేకూరే విధంగా.. వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఒక్క పార్కుల అభివృద్ధి పనుల్లోనే ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుంటే.. మిగిలిన పనుల్లో మంత్రి నారాయణ ఇంకా ఎంత.. అవినీతికి పాల్పడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈరోజు నెల్లూరులో తాము చేసిన అభివృద్ధి పనులకు రంగులు వేసుకోవడం తప్ప.. మంత్రి నారాయణ ఒక్క అభివృద్ధి పనైనా చేశారా చెప్పాలన్నారు. గత ఐదేళ్లలో.. నెల్లూరు నగరంలో తాము చేసిన 100 అభివృద్ధి పనులు చెప్పేందుకు మేము సిద్ధంగా ఉన్నామని.. 2014-19.. ఐదేళ్ల కాలంలో మంత్రి నారాయణ సక్రమంగా చేసిన ఒక్క అభివృద్ధి పనినైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. మేము శంకుస్థాపన చేసి.. పనులు పూర్తయిన.. నిర్మాణాలకు.. ఈ రోజు తెలుగుదేశం పార్టీ నేతలు రిబ్బన్ కట్ చేసుకుంటున్నారే తప్ప.. వారు సొంతంగా చేసింది ఏమీ లేదన్నారు.

## డాక్టరేట్ పట్టా పొందుకున్న కోలా సునీత



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 10)**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జంతుశాస్త్ర విభాగం నుంచి కనిగిరి పట్టణానికి చెందిన కోలా సునీత డాక్టరేట్ పట్టా పొందారు. "పసిఫిక్ వైట్ ష్రింప్ (పీనస్ వెన్నమి) హేచరీస్ లో వాటి లార్వా ఫీడ్స్, బయోఫ్లాక్ టెక్నాలజీ యొక్క సమర్థత" మీద దాదాపు పదేళ్లు ప్రొఫెసర్ పి పద్మావతి పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. వర్సిటీ రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి సుధాకర్ కోలా సునీతకు పీ హెచ్ డి ప్రధానం చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్టర్ ఆచార్య జి సింహాచలం, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య వీరయ్య, డీన్ ఆఫ్ నాచురల్ సైన్సెస్ ఆచార్య వి ఉమామహేశ్వరరావు, డిపార్ట్మెంట్ హెడ్ వి వెంకటరత్నమ్మ, జియాలజీ డిపార్ట్మెంట్ హెడ్ ఆచార్య రత్నాకర్ , వివిధ విభాగాల ఆచార్యులు అభినందించారు. వీరి భర్త డాక్టర్ డార్విన్‌కు గత ఏడాది డాక్టరేట్ పట్టా పొందుకున్నారు. కుటుంబంలో ఇరువురికి డాక్టరేట్ రావడంతో కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 63 మంది క్విస్ విద్యార్థులకు ఎంఎన్సీలో ఉద్యోగాలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)**

ఒంగోలు క్విస్ కళాశాలలో వివిధ విభాగాల్లో చదువుతున్న 63 మంది విద్యార్థులు ప్రముఖ బహుళ జాతి సాఫ్ట్ వేర్ సంస్థ కో ఫోర్జ్‌లో ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ సెల్ విభాగాధిపతి డాక్టర్ జగదీష్ తెలియజేశారు. కంపెనీకి చెందిన పలువురు విభాగాధిపతులు క్విస్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు చేశారు. దాంట్లో భాగంగా విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్స్, రౌండ్లు నిర్వహించి 63 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకి క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి. హనుమంత రావు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్‌కి సంబంధించి విద్యార్థులకి ప్రత్యేక శిక్షణ అందిస్తామని, ప్రతి ఒక్కరు ఉద్యోగాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ అందిస్తున్నామని కళాశాల యాజమాన్యం తెలిపింది.

## మన రక్షణ వ్యవస్థకు పూజలు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 10)**

పహల్గాంలో హిందువులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులలో మరణించిన మన భరతమాత ముద్దుబిడ్డలపై జరిగిన ఉగ్రదాడి ప్రతీకారంగా ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, మన దేశ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సారథ్యంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై వీరోచిత దాడులు చేసి వందమంది ఉగ్రవాదులు మట్టు పెట్టడం జరిగింది. ఇందుకుగాను మన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ బలగాలకు, మన దేశ రక్షణ వ్యవస్థకు మద్దతుగా కనిగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో మన ఆర్మీకి, రక్షణ వ్యవస్థకి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న

# రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 10)**

రవితేజ హాస్పిటల్ స్థాపించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఒక్క సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు డాక్టర్ సుష్మిత, డాక్టర్ శ్రీకాంత్‌ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబ నుంచి వచ్చి ఉన్నతమైన చదువులు చదివినా డాక్టర్స్ సుస్మిత, శ్రీకాంత్ పుట్టిన గడ్డకు రుణం తీర్చుకోవాలని వెనుకబడిన మాచర్ల ప్రాంతాన్ని ఆధునికి వైద్యసేవలు అందించాలని రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ స్థాపించి అతి తక్కువ సమయం ప్రజల అత్యాధునిక వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు పొందారు డాక్టర్స్ సుష్మిత శ్రీకాంత్ అని యాగంటి గారు వెల్లడించారు.

గతంలో మాచర్ల నియోజకవర్గం ప్రజలు చిన్న పాటి వైద్యనికి కూడా నరసరావుపేట,గుంటూరు నగరానికి వెళ్లి ఎక్కువ ఖర్చు పెట్టుకుని వైద్య సేవలు పొందేవారని లక్షలు బిల్లు ఖర్చు పెట్టే వాళ్ళమని వెల్లడించారు.కానీ మన మాచర్ల పట్టణంలో రవితేజ స్పెషాలిటీ ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఖర్చులతో వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారని డాక్టర్ సుష్మిత, శ్రీకాంత్ అని వెల్లడించారు. ఎప్పటికప్పుడు వైద్యరంగంలో వస్తున్న అత్యాధునిక వైద్యాన్ని అందుపుచ్చుకొని, సాంకేతిక ఆర్టిఫిషియన్ ఇంటెలిజెంట్ ఉపయోగించే మన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలకు సేవా భావంతో వైద్యసేవలు అందించాలని మిగిలిన డాక్టర్స్‌ని కోరారు. అలాగే హాస్పటల్ నందు పనిచేస్తున్న స్టాప్స్ ను కూడా వైద్య సేవలు కోసం వస్తున్న మన ప్రజలతో సేవ భావంతో మెలిగి హాస్పిటల్ అభివృద్ధికి తోడ్పడి మంచి పేరు ఘడించాలని స్టాఫ్‌ని కోరారు. అలాగే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం కూడా రవితేజ హాస్పిటల్‌కు తొందరలో (30 నుంచి 45 రోజుల్లో) అందుబాటులో వస్తుంది అని మన ప్రాంత ప్రజలందరూ ఉపయోగించుకోవాలని యాగంటి మల్లికార్జున రావు కోరారు. రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ తొందరలో రవితేజ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్గా అవతరించాలని యాగంటి మల్లికార్జునరావు మనస్ఫూర్తిగా వెల్లడించారు.



## జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)**

పొదిలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, సామాజిక సేవకులు, హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మొగల్ కరిముల్లా బేగ్ జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సరియాను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జరిగే హబీబుల్లాబేగ్ సేవా సంస్థ 8వ వార్షికోత్సవానికి ఆమెను ఆహ్వానించారు. ఆమె రావడానికి సుముఖత వ్యక్తం చేశారు. సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హై కలెక్టర్‌కి విన్నవించారు. పొదిలిలో గత ఏడేళ్లుగా తల్లిదండ్రులు లేని విద్యార్థులకు, పదో తరగతి, ఇంటర్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు హబీబుల్లా సేవా సంస్థ ద్వారా అందజేస్తున్నారు. వివిధ సందర్భాలలో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ప్రతినిత్యం నిరుపేదలకు అల్పాహారం సమకూరుస్తున్నారు. సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకున్న కలెక్టర్ కరీముల్లా బెగ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సమాజాభివృద్ధికి మీలాంటి వారి సేవలు ఎంతైనా అవసరమని ఆమె చెప్పారు. ఆయన వెంట యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, జిల్లా కోశాధికారి ఎన్ చిన్న స్వామి, జిల్లా కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, ఎం బాలరాజు, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి తావులేకుండా సీఎంఆర్ఎఫ్ సాయం

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన జీవీ, మక్కెన



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 10)**

ఆపద, అవసరంలో ఉన్నవారికి లంచం అన్నమాటకు తావులేకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వేగంగా సాయం అందుతుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా విజ్ఞప్తి నుంచి చెక్కుల పంపిణీ వరకు పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఈ విషయంలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా తన కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. వినుకొండలోని తన కార్యాలయంలో శనివారం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గం పరిధిలోని 63 మంది లబ్ధిదారులకు రూ.58,11,530 విలువైన చెక్కులు అందించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి అడిగిన ప్రతీ ఒక్కరికీ లేదనకుండా సాయం చెస్తున్నామన్నారు. ఎంతో మానవతా దృక్పథంతో ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ కు వినతులను వీలైనంత వేగంగా పరిష్కరించాలని పదేపదే సూచిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేద ప్రజల అరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జీవీ ఆంజనేయులు చెప్పారు.



అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు, ఆస్పత్రి ఖర్చులు అయినప్పుడు, ముందస్తు శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సిన అనేకమంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటున్నారని, వారందరికీ సాయం అందేలా పార్టీ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు సిఫారసు చేస్తున్నామన్నారు. అడిగిందే తడవుగా అవసరంలో ప్రతిఒక్కరికీ పారదర్శకంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సీఎం చంద్రబాబు ఆర్థిక సాయం అందిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న ఎంతోమందికి సాయం అందజేశామని, తాజాగా అత్యవసర చికిత్స చేయించుకోవడానికి వీలుగా ముందస్తుగా నలుగురికి రూ.14 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ)ని, 59 మంది లబ్ధిదారులకు రూ.43.61 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 10)

మొన్న ఎవరో బుద్ధి మందం వారు కాశ్మీర్లో హత్యాకాండ చేసింది ముస్లిం ఉగ్రవాదులే అంటే.... ముస్లింలు మొత్తం ఉగ్రవాదులా అని అడిగారు.. అసలు తెలివి ఉందా..? ఒక మంచి పని చేద్దామని జనసేన పార్టీ తరపున మజ్జిగ చలివేంద్రం ప్రారంభించదలిస్తే టెంటు ను చిందరవందర చేస్తారా మీరు అసలు మనుషులేనా బుద్ధుందా..... ఈ పిరికిపంద చర్యలను న్యాయపరంగా ఎదుర్కొంటాం...ఎటువంటి వారైనా ఉపేక్షించేది లేదని, జనసేన సేవా మార్గాన్ని ఎవరూ ఆపలేరని జనసేన నాయకులు కిషోర్ గునుకుల అన్నారు. నెల్లూరు సిటీ గాంధీ బొమ్మ సెంటర్లో జనసేన డొక్కా సీతమ్మ మజ్జిగ చలివేంద్రం ప్రారంభం, ఫ్రీడమ్ ఫైటర్ నెల్లూరు నుంచి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ న్యాయవాది, కమ్యూనిస్టు లీడర్, డబ్బుతో సంబంధం లేకుండా పేదల కోసం దేశవ్యాప్తంగా కోర్టుల్లో మద్దతుగా నిలిచిన సామాజిక వాది స్వర్గీయ వేములపాటి అనంతరామయ్య వారి సతీమణి కామేశ్వరి జ్ఞాపకార్థం వారి కుమారులు ఏపీ టిడ్కో చైర్మన్, నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు, జనసేన క్రమశిక్షణ విభాగ హెడ్ వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో అనంతరామయ్య మనవడు ప్రముఖ లాయర్ శరత్ చేతుల మీదుగా శనివారం గాంధీ బొమ్మ సెంటర్లో మజ్జిగ చలివేంద్రం ప్రారంభమైంది. ఒక మంచి ఉద్దేశంతో వేసవి తాపానికి ప్రజలు దాహార్తిని మజ్జిగతో చేర్చాలని మా జిల్లా పర్యవేక్షణ వేములపాటి అజయ్ సూచనలతో దాదాపుగా నెల్లూరు సిటీలో పది పైగా మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా గాంధీ బొమ్మ దగ్గర ఈ రోజు ఉదయాన ప్రారంభించవలసిన చలివేంద్రం కొంతమంది పిరికిపందలు ఉన్మాద చర్యల వల్ల ఫ్లెక్సీలు చించి వేయడం వల్ల కార్యక్రమం ఈరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించబడింది. ఒక మంచి పని చేసేందుకు ముందుకు వస్తున్న జనసేన పార్టీకి ఆటంకం కలిగించడం ఎంతవరకు సబబో ఉన్మాదులు ఆలోచించవలసిన అవసరం ఉంది. ఫ్లెక్స్ లో ఉన్న ముగ్గురు కూడా పేదల పక్షాన నిలబడి సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న వారే ఏ మాత్రం విచక్షణ ఉన్నా ఎటువంటి చర్యలు పూనుకూరు ఇటువంటి ఎన్ని ఆటంకాలు ఎవరైనా జనసేన ని ఆపలేరు. జనసేన ముఖ్య లక్ష్యం సేవ చేయడం సేవ మార్గంలోనే ముందుంటామన్నారు. ఫ్లెక్స్ కోసిన వారిపై ఫిర్యాదు చేసి ఉన్నాం... కేసు కట్టి శిక్షించే వరకు కూడా ఈ విషయాన్ని వదలమన్నారు. నెల్లూరు ప్రజలకు అందరికీ సుపరిచితులకు వేముల పాటి అనంత రామయ్య నెల్లూరు నుంచి ఒక భారతదేశం గర్వించదగ్గ గుర్తించదగిన న్యాయవాదిగా పేదల పక్షాన నిలబడి ఎన్నో న్యాయ సేవలను ఉచితంగా అందించి సామాజిక న్యాయం కోసం పాటుపడిన కమ్యూనిస్టు నాయకుడు వేములపాటి అనంతరామయ్య వారి జ్ఞాపకార్థం సామాజిక న్యాయం కోసం పోరాడిన మా జనసేన నాయకులు వేములపాటి అజయ్ నాయకులు ఈ చలివేంద్రాలు 90 రోజుల పాటు ప్రజల సేవలో ఉంటాయని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా కార్యాలయం ఇన్‌ఛార్జి జమీర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్ రామిరెడ్డి, సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, జనసేన నాయకులు సుధా మాధవ్, ప్రశాంత్ గౌడ్, గుర్రం కిషోర్, అనుదీప్, బత్తల శ్రీకాంత్, పేనేటి శ్రీకాంత్, రిషి యాదవ్, హరి, యాసిన్, మహేష్, పవన్, రాజేష్, పోలయ్య, మనోజ్, బాలు, గజరాజు శాంతి కల, కృష్ణవేణి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన సంఘం ఆధ్వర్యంలో వీర జవాన్‌కు ఘన నివాళి





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మే 10)

భారత్, పాకిస్తాన్ల మధ్య ఆపరేషన్ సింధూర్‌లో దేశ రక్షణలో అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ (25)కు వై.పాలెం గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత పట్టణంలోని గిరిజన భవనం దగ్గర నుండి పుల్లలు చెరువు సెంటర్, వినుకొండ రోడ్డు మీదగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళు లర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి కాసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ 25 ఏళ్ల వయసులో మాతృభూమి కోసం ప్రాణాలర్పించి అమరుడైన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తు పెట్టుకుంటుందన్నారు. మురళి నాయక్ చూపిన ధైర్య సాహసాలు అందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు, ఉద్యోగులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయంలో జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులు





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మే 10)

యర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ మంత్రు నాయక్ ఆధ్వర్యంలో పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు.

## చదువే అభివృద్ధికి మూలం ప్రముఖ న్యాయవాది ధనలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, సంతనూతలపాడు, మే 10)

వెనుకబడిన వర్గాల వారికి వారి చదువే అభివృద్ధికి మూలం అని ప్రముఖ న్యాయవాది నేలటూరి ధనలక్ష్మి పేర్కొన్నారు. పేర్నమిట్ట శాంతినగర్ కామ్రేడ్ నూకతోటి కోటయ్య కళా ప్రాంగణం ఆవరణలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విద్యా శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ సంవత్సరం ఈ వేసవి ఉచిత విద్యా శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మ్యాథమెటిక్స్, ఇంగ్లీష్ తదితర సబ్జెక్టులతో పాటు చిన్నారులు కరాటే, పెయింటింగ్ వంటి వాటిలో కూడా శిక్షణ ఇవ్వడం ప్రశంసనీయమని, దీనితో పాటు ఉదయాన్నే విద్యార్థులకు అల్పాహారం అందించడం ఆదర్శవంతమైన కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమానికి స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవి కుమార్ నేతృత్వం వహించగా సి ఎస్ ఆర్ శర్మ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సాల్మన్, స్టడీ సెంటర్ ఉపాధ్యాయులు కళ్యాణ్, రామాంజనేయులు, కైలా అనురాధ, టైక్వాండో సీనియర్ కోచ్ ఎరిచర్ల కోమల శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురించిన పుస్తకాన్ని న్యాయవాది ధనలక్ష్మికి అందజేశారు.

## భారత జవాన్లు, ప్రధాని మోదీ గోత్ర నామాలతో పూజలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ దగ్గర ఉన్న శివాలయంలో భారత్- పాకిస్థాన్ల మధ్య జరుగుచున్న యుద్ధంలో భారత్ విజయము సాధించాలని కోరుతూ భారత్ జవాన్లు. నరేంద్ర మోడీ గోత్ర నామాలతో బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యోగయ్య యాదవ్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా జరుగుచున్న యుద్ధంలో భారత దేశం పాకిస్థాన్ లో ఉన్న టెర్రరిస్టు క్యాంప్‌లు, దాదాపు అన్ని ప్రధాన ఎయిర్ పోర్టు లు. పాకిస్థాన్‌లో ఉన్న ఏంటి మిస్సైల్ సిస్టమ్ లు ధ్వంసం చేయటము జరిగిందన్నారు. దాదాపు 50 %యుద్ధము పాకిస్థాన్ ప్రజలపైన ఒక్క బుల్లెట్ వేయకుండానే ముగిసింది అని తెలుపుతూ ఈ రెండు రోజుల యుద్ధములో కూడా టర్కీ దేశము సప్లై చేసిన డ్రోన్స్ ద్వారా, చైనా పంపించిన మందు గుండు సామగ్రి ఆయుధాల తోనే యుద్ధము చేయగలిగారని పాకిస్థాన్ లో ఉన్న అన్ని పెద్ద నగరాలు ఇప్పటికే ధ్వంసమయ్యాయన్నారు. ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న పాకిస్థాన్ ఈ జన్మలో కోలుకోలేదన్నారు. ఇంక రెండు రోజులు మాత్రమే పాకిస్థాన్ యుద్ధభూమిలో నిలవ గలదని తెలుపుతూ పాకిస్థాన్ పిరికి పందలా ఎల్‌వోసీ దగ్గర ఉన్న భారత దేశ గ్రామాలపైన దాడి చేయటము దుర్మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమములో బిజెపి ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు సెగ్గేమ్ శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి, రాయపాటి అజయ్ కుమార్, ఐ. సీతా రామయ్య. జిల్లెళ్ళమూడి రమాదేవి, బి.విజయా రావు, బి.రాజ శేఖర్, పి. దామోదర్, ఎస్.రాజేష్ వర్మ, గుఱ్ఱం రంగనాథ్. దనిసెట్టి రాము, ఆ.సంజీవ్ కుమార్, ఈమని బలరాం, సుబ్బారావు, వెంకటరావు, వెంకట్, తిరుమలరావు, అనేక మంది భక్తులు పాల్గొన్నారు.





## వైభవంగా కొండేపమ్మ గుడి 20వ వార్షికోత్సవం



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 10)

కొండపిలోని కొండేపమ్మ గుడి 20వ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రీస్తుపూర్వం 20వ శతాబ్దంలో కొండపిలోని కొండపి అమ్మవారు స్వయంగా వెలిశారు. ఆలయం శిథిల అవస్థకు చేరడంతో కొండపి గ్రామానికి చెందిన గుర్రం వెంకట ప్రసాదు తులసి దంపతులు 20 సంవత్సరాల క్రితం గుడి నూతనంగా నిర్మించారు. ఏటా వార్షికోత్సవ నిర్వహిస్తూ వచ్చిన భక్తులకి అన్నదానం నిర్వహిస్తుంటారు. ఈ ఆలయానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు ఉన్నాయని ఒక్కసారి అమ్మవారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగుతాయని, ఆలయ ప్రధాన అర్చకులు కాళేశ్వరరావు తెలిపారు.

# అంకమ్మ తల్లి కొలుపుల్లో ఉద్రిక్తత

### మద్యం సేవించి ఒక వర్గం పై మరో వర్గం గొడవలకు దిగినట్లు సమాచారం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

నాగులుప్పలపాడులో అంకమ్మ తల్లి కొలుపుల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. 150 సంవత్సరాల చరిత్ర ఉన్న అంకమ్మ తల్లి దేవాలంలో వర్గాల మధ్య ఆధిపత్య పోరు వల్ల గత మూడు సంవత్సరాలుగా అమ్మవారి కొలుపులు నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో ఆధిప్యతం కోసం పోటీ పడుతున్న మూడు వర్గాలు ఈ నెల 10వ తేదీన కొలుపులు చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు కోర్టు కూడా అనుమతి ఇచ్చిందని ఒక వర్గం వారు చెబుతున్నారు. అయితే, ఈ రోజు కొలుపులకు ఒక వర్గం రాగా మరొక వర్గానికి చెందిన కొంతమంది మద్యం తాగి గొడవకు దిగి తరువాత పురుగుల మందు తాగారు. వీరి దాడిలో గాయపడిన వారు తమను అకారణంగా ప్రత్యర్ధి వర్గం వారు కొట్టారని ఆరోపిస్తున్నారు. ఈ ఘర్షణలో గాయడిన వారు, పురుగుల మందు తాగిన వారు చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు వారు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు.









# శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యం







**ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు**

**తనిఖీలో భాగంగా ప్రత్యేక**

**పోలీసు బలగాలు, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు**

**ఎవరైనా నేరాలకు పాల్పడినా,**

**ప్రోత్సహించినా వారి పై కఠిన చర్యలు తీసుకుంటాం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)**
జిల్లాలో నేరాలు నియంత్రణ, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, అసాంఘిక శక్తుల కదలికలను నిరోధించే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ శిక్షణ అనంతరం ఒంగోలు పట్టణం నందు మొత్తం 50 ప్రదేశాలలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలసి డాగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతమైన తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో, రహదారులపై వాహనాలు, శివారు ప్రాంతాల్లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించారు. ఈ తనిఖీలో రికార్డులు సరిగా లేని పలు మోటార్ సైకిల్, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్న వాటిని సంబంధిత పోలీసు స్టేషన్లకు తరలించారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన యెడల చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల భద్రత, నేర నియంత్రణ దృష్ట్యా ఈ తనిఖీలు నిర్వహించామని, చట్ట వ్యతిరేక పనులకు, దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100/112 తెలియజేయాలని అక్కడి ప్రజలను కోరారు. ఈ తనిఖీలో డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐలు నాగరాజు,శ్రీనివాసరావు,అజయ్ కుమార్, సుబ్బారావు, బీమా నాయక్, అస్సన్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, జగదీష్, పాండురంగారావు, మల్లికార్జున, రామకోటయ్య, సురేష్, ప్రభాకర్, రామారావు, సోమశేఖర్, శ్రీనివాసరావు, సమ్మిముల్లా, హాజరత్తయ్య, ఖాజావలి, సుబ్బారావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.





## హంస వాహనంపై లక్ష్మీ నరసింహుడు

## అంగరంగ వైభవంగా లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు





**(షణ్ముఖ వెలుగు, దక్కిలి, మే 10)**
నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో జరుగుతున్న శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీపెనుశీల లక్ష్మీ నరసింహస్వామి శనివారం హంసవాహనం పై సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొనలోని అలంకార మండపంలో హంసవాహనాన్ని వివిధ రకాల పుష్పలతో అలంకరించి అందులో లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి, ప్రత్యేకంగా అలంకరించి మేళాతాళాలు, వేదమంత్రాలు, వేద పారాయణం అర్చకులు చదువుతుండగా శ్రీవారు హంసవాహనంలో కోన మాడ వీధుల్లో విహరిస్తూ పారువేట మండపం వరకు క్షేత్రోత్సవం నిర్వహించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించుకొని మొక్కలు చెలించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్, పీర్ల సోమయ్య యాదవ్, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, తిరుమల వేదపాఠశాల పంచరాత్ర ఆగమ పండితుడు రామానుజాచార్యులు, ఆర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, వర్ధన్ స్వామి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలో పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 10)**
మండలంలోని భోగనంపాడు గ్రామంలో శనివారం శ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్ళు సందర్భంగా గ్రామంలో నిర్వహించిన శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని గ్రామదేవత అంకమ్మ తల్లి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, మండల టిడిపి నాయకులు మండవ మురళీమోహన్, గుమ్మళ్ళ వెంకట్రావు, పల్లపోతు రమేష్ బాబు, పిల్లి వెంకటనారాయణ, అనుమోలు రాజా రమేష్, అనుమోలు సుధాకర్, నితిన్ చౌదరి, సర్పంచ్ షేక్ చిన్న మస్తాన్, మాదాల నరేష్ గ్రామంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## భారత్ విజయం సాధిస్తుంది



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 10)**
భారత్ పాక్ యుద్ధ నేపథ్యంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కొండేపి రోడ్డు కామేపల్లి సెంటర్లోని బిజెపి నాయకులు బొడ్డపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో యుద్ధంలో వీరమరణం పొందిన మన తెలుగు బిడ్డ మురళి నాయక్‌కీ సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్ పై భారత విజయం సాధిస్తుందని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గోగినేని వారి పాలెం టిడిపి నాయకులు లక్ష్మి నరసింహం, కొండపి మండల గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ స్వామి వారి కళ్యాణం

### ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

### ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 10)**
మండలంలోని పెదపట్టపుపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ స్వాములు కళ్యాణం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకి వేద పండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ శ్రీ సీతారాముల ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నానని ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం నాకు సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులతో మాట్లాడిన ఎమ్మెల్యే, గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి గ్రామస్తులు పార్టీ నాయకులు మేళ తాళాలతో ఘనస్వాగతం పలికారు. ఈ మహోత్సవంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









## తల్లికి వందనం ముందస్తు సెలబ్రేషన్ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 10)
ఉలవపాడు మండలం వీరేపల్లి సెక్టర్‌లోని చిన్న పట్టపు పాలెం అంగన్వాడి సెంటర్‌లో సిడిపిఓ శారద ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఏ విజయలక్ష్మి అధ్యక్షతనలో తల్లికి వందనం సెలబ్రేషన్ (ముందస్తు వేడుకలు) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ప్రీస్కూల్ పిల్లలు తల్లులను ఆహ్వానించి సెంటర్లో జరిగే యాక్టివిటీస్ గురించి వివరించడం జరిగింది. పిల్లలచే తల్లుల యొక్క పాదాలను కడిగించి, తల్లులను పూజించి పాదాభివందనం చేయించడం జరిగింది. పిల్లలకు తల్లులను గౌరవించే విధానం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఏ విజయలక్ష్మి, గ్రామస్తులు, ఏ డబ్ల్యు డబ్ల్యు కె. సుజన శ్రీ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 10)

ప్రభుత్వం అప్పగించిన డ్రైనేజీ కాలువలు పనులను నాణ్యత ప్రమాణాలు విధిగా పాటిస్తూ వేగవంతంగా నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం కనిగిరి పట్టణంలోని 8వ వార్డు లోని అలీ మసీద్ లైన్ లో డ్రైనేజ్ కాలువలు నిర్మాణం చేపట్టే పనులను ఆయన పరిశీలించ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో కనిగిరి మున్సిపాలిటీని అభివృద్ధి పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వ నిధులతో మంజూరై డ్రైనేజ్ కాలువలు నిర్మాణ పనులను తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. సాగునీటి కాలువలు,మురికి కాలువలు రోడ్ల మీదికి రాకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అప్పగించిన పనులను నిర్ణీత కాలం గడువులో పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ మస్తాన్ వలి, మాలకొండయ్య, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 10)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నియోజకవర్గంలో శనివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతనంగా కాలేజీ రోడ్డులో ఏర్పాటు చేసిన జాకి షో రూమ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి పివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. మార్కాపురం పట్టణంలో తోట వారి వివాహ మహోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు మార్కాపురం పట్టణంలో మదిరే వారి వివాహ మహోత్సవం సందర్భంగా విచ్చేసి నూతన వధువును ఆశీర్వదించారు. కొనకనమిట్ల మండలంలోని నాగంపల్లి వారి వివాహ మహోత్సవం సందర్భంగా విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 22వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు.

## భారత యుద్ధ సైనికులు విజయం కోసం పాకిస్తాన్ అపజయం కొరకు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక పూజలు



(షణ్ముఖ వెలుగు, దక్కిలి, మే 10)

పాకిస్తాన్ ఉగ్ర దాడులను ఎదుర్కొంటున్న భారత సైనికులు అందరు క్షేమంగా ఉండాలని వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మ కి ఎం ల్ ఎ కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ప్రశాంతంగా ఒక రోజు గడుపుతున్నాము అంటే అది మన కోసం, దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడే సైనికులు వలనేనని అన్నారు. వీర మరణం పొందిన సైనికుల సేవలు మరువలేనివి అన్నారు. భారత పౌరులు అందరు మన సైనికులు కోసం ప్రార్థనలు చేసి వారు క్షేమంగా ఉండాలని కోరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో రామదాసు గంగాధర్, పులికొల్లు రాజేశ్వరరావు, ఆనంద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మే 20న సార్వత్రిక సమ్మెను, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

## సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి అజయ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 10)

మే 20న సార్వత్రిక సమ్మెను , గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్ కుమార్ కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఒంగోలు ఎల్బీజీ భవన్ నందు సమ్మె సన్నాహక జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ మోహన్ అధ్యక్షత వహించి నడిపారు. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఉమ్మడిగా కార్మిక సంఘాలు , రైతు సంఘాలు , వ్యవసాయ కూలీ సంఘాలు ఐక్యంగా మే 20వ తేదీన సమ్మె నిర్వహించాలని నిర్ణయించాయి. గత నాలుగు మాసాల నుంచి సమ్మె ప్రిపరేషన్ చేయటం జరుగుతుంది. ప్రధానంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొని చట్టం చేసింది. 2025 ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు కూడా సర్కులర్ జారీ చేసింది. కొన్ని రాష్ట్రాల్లో అమలుకి ప్రయత్నం జరుగుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేయడం జరుగుతోంది. అనేక పోరాటాలు, ఉద్యమాలు నిరసనల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగింది. తాత్కాలిక వాయిదా వేసిన ఈ ప్రమాదం ముందుకు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఈ లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని చెప్పి నిర్ణయించడం జరిగింది. ఈ సమ్మెలో ఒక లేబర్ కోడ్స్ కాదు వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని కల్పించాలని , రోజుకి 600 రూపాయలు డబ్బులు కేటాయించాలని , పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని, డిమాండ్ చేయడం జరుగుతుంది. అలాగే నూతన ఆర్థిక విధానాలు ప్రారంభించి అమలు చేయడం ప్రారంభించిన తర్వాత దేశంలో కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, కంటింజెంట్ ఉద్యోగులు సంఖ్య కోట్ల సంఖ్యలో పెరిగిన పరిస్థితి చూస్తా ఉన్నాం. వీరి వేతనాలు చూస్తా ఉంటే మూడు వేల రూపాయల నుంచి పదివేల రూపాయలు వేతనం వస్తున్నది.ఈరోజు ఒక కుటుంబం జీవనం గడపాలంటే 30 వేల రూపాయల డబ్బులు కావాల్సి ఉండగా పదివేల లోపు వచ్చేటువంటి ఉద్యోగులు కార్మికులు ఉన్నారంటే మిగతా డబ్బులు అప్పులు తీసుకువచ్చి కట్టలేక ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి మనం చూస్తా ఉన్నాం. మరోపక్క వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని పరిస్థితి కనపడతామన్నారు. వర్షాభావం వల్ల పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా ఎరువులు ధరలు పెరగటం వల్ల వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి ఎం ఎస్ పి చట్టం తీసుకురావాలని పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా పోరాడుతున్నారు. ప్రభుత్వాలు ఈ పోరాటాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తా ఉంది .చట్టం అమలు చేయడానికి సిద్ధంగాని పరిస్థితి కనపడతా ఉంది అందువల్ల రైతులకి పండించిన పంటలకు గిట్టుబాటు ధర అనేది తీసుకురావాల్సిన అవసరం ఉంది. అలాగే దేశవ్యాప్తంగా శ్రామిక మహిళల స్కీమ్ వర్కర్స్ అయిన అంగన్వాడి, ఆశ, వివోఏ, మధ్యాహ్న భోజనం, వీళ్ళందరూ స్కీము వర్కర్స్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతా ఉంది. క్రింది స్థాయిలో స్కీమ్ వర్కర్స్ మీద రాజకీయ వేధింపులు తీవ్రంగా కనబడతా ఉన్నాయి ప్రభుత్వంలో మారినప్పుడల్లా స్కీమ్ వర్కర్స్ మీద గ్రామస్థాయి నాయకులు పెత్తనం కొనసాగించి పదివేలు ఇరవై ఏళ్లుగా పని చేస్తున్న స్కీమ్ వర్కర్స్ ని తొలగించేటటువంటి ప్రయత్నం చేస్తా ఉన్నారు. దీని కారణంగా స్కీమ్ వర్కర్స్ చాలామంది ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి కూడా మనం చూస్తా ఉన్నామన్నారు. అలాగే దేశంలో నిరుద్యోగ సమస్య అనేది ఒక తీవ్రమైన సమస్యగా ఈరోజు ముందుకు వచ్చింది. బీటెక్లు చేసిన ఎంటెక్‌లు చేసిన ఉద్యోగం దొరకని పరిస్థితి వేతనాలు రాని పరిస్థితి కనపడతావు అలానే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాల దేశవ్యాప్తంగా జరుగుతా ఉన్నాయి కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలు ఇవ్వాలని చెప్పి డిమాండ్‌తో పోరాటాలు జరుగుతా ఉంది. ఈ దొడ్డి దారిన పార్లమెంట్లో చట్టం ఆమోదింపజేసి ఇది పే స్కేల్ కిందకు రాదని చెప్పి నిర్ధారించడం కూడా జరుగుతా ఉంది ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని కేంద్ర కార్మిక సంఘాలు , రైతుకూలీ సంఘాలు ఇంకా అనేక స్వతంత్ర ఫెడరేషన్లు అన్నీ కూడా దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని మే 20వ తేదీన సార్వత్రిక సమ్మె చేసి కోట్ల మంది ఉద్యోగులు కార్మికులు వ్యతిరేకంగా నిలబెట్టాలని చెప్పి సదస్సు తీర్మానం చేయడం జరిగింది. వేతనాల కుదింపు,పనిగంటల పెంపు,సామాజిక భద్రత లేకపోవటం ,రవాణా రంగంలో జరిమానాలు ,శిక్షలు పెంచటం ఇంకా అనేక మార్పులు వస్తున్నాయి. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెండ్యాల హనుమంతరావు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె వీరారెడ్డి ,కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు , సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ , సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా నాయకులు సలార్ బ్యాంక్ ఎంప్లాయిస్ నాయకులు పీకే రాజేశ్వరరావు, యస్.డబ్ల్యు.యఫ్ రాష్ట్ర కార్యదర్శి యం అయ్యపరెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు జీవి రాగయ్య, మెడికల్ రిప్స్ రాష్ట్ర నాయకుడు సిహెచ్ చిరంజీవి, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు బి వెంకటరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి కల్పన, ఒంగోలు నగర సిఐటియు ఒంగోలు నగర్ కార్యదర్శి టి మహేష్, చీకటి శ్రీనివాసరావు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కొర్నెపాటి శ్రీనివాసరావు, రాజశేఖర్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

# పరారీలో కాకాణి.. టీడీపీ వైపు వైసీపీ నేతల చూపు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 10)

ఆరు వారాలుగా దొంగలా దాక్కున్న గోవర్ధన్ రెడ్డిపై వైసీపీ కేడర్‌లో సడలిన నమ్మకం ఒక్కొక్కరుగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. శనివారం ముత్తుకూరు మండలం తాళ్లపూడిలో వైసీపీ కంచుకోట బద్దలు పిరికిపంద కాకాణి నాయకత్వంలో పని చేయలేమని కీలక వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో వైసీపీ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సుధీర్, జంగిట శీనయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు జంగిట సుధాకర్, కోట ఏడుకొండలు, జంగిట వెంకటేశ్వర్లు, షేక్ అల్లా బాషా, కోట సురేష్, మాజీ వలంటీర్ కోట సాయి, పాకాల సురేష్ తదితరులకు ఆత్మీయ ఆహ్వానం పలికారు.

వచ్చే వారంలో మరిన్ని కీలక చేరికలు ఉన్నాయి.










# మహిళా సాధికారతే సీఎం చంద్రబాబు లక్ష్యం

## మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 10)

నగరంలోని 52వ డివిజన్‌లో బీసీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని రాష్ట్ర పురపాలక , పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు డివిజన్ ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు.. అనంతరం కుట్టు శిక్షకులను వివరాలు అడిగి మంత్రి తెలుసుకున్నారు. మహిళా సాధికారతపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం అని తెలిపారు. జిల్లాలో 4967 మందికి మిషన్ లు ఇవ్వటంతో పాటు శిక్షణ ఇప్పిస్తున్నామని, వృత్తిలో నైపుణ్యత పెంచేందుకోసం రోజుకి రెండు షిఫ్టుల్లో 72 మందికి ట్రైనింగ్ ఇస్తున్నామని అందులో ఒక్కొక్కరిపై 21700 రూపాయలను ప్రభుత్వం వెచ్చిచ్చిందని తెలిపారు. రూ.10.80 కోట్ల రూపాయలు కుట్టు మిషన్‌లు, శిక్షణకు నెల్లూరు జిల్లాకు కేటాయించమన్నారు. ఎంఎస్ఎంఈ నడుపుతున్న రమాదేవి ఆర్గనైజేషన్ ని హైదరాబాద్ లో పరిశీలించనాని, 54 వ డివిజన్‌లో 12 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు భవనం కడుతున్నామన్నారు..26 యూనిట్లలో 100 మందికి అవకాశం కల్పిస్తామని..పరిశ్రమలు వస్తేనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకొంటుంది అని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి,నగర అధ్యక్షుడు మామిడాల మధు, టిడిపి సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతరెడ్డి, కార్పొరేటర్ అస్మమొయినుద్దీన్, ప్రెసిడెంట్ వెంకయ్య యాదవ్, మైనారిటీ ప్రెసిడెంట్ సయ్యద్ ఇక్బాల్, జనరల్ సెక్రటరీ పాశమోహిద్దీన్, సుధీర్, టిడిపి ముఖ్య నేతలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com